ట్రాఫిక్‌తో అవస్థలు

- జగదాంబ జంక్షన్, కలెక్టరేట్ మధ్య నిత్యం ట్రాఫిక్ రద్దీ
- కలెక్టరేట్, జిల్లా పరిషత్ జంక్షన్ మధ్య కూడా ఇదే పరిస్థితి
- వాహనదారులు, పాదచారులకు తప్పని అవస్థలు



తెన్నేటి పార్కు నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో వాహనాల రద్దీ

డాబాగార్డెన్స్: నగరంలో పెరుగుతున్న వాహనాలతో పాదచారులు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ సమస్య తప్పడం లేదు. ముఖ్యంగా విద్యార్థులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు తమ గమ్యాలకు చేరుకునే వేళ, తిరిగి ఇంటికి చేరుకునే సమయాల్లో సమస్య తీవ్రంగా ఉంటోంది. దక్షిణ నియోజకవర్గ పరిధిలోని కలెక్టరేట్ కూడలి నుంచి జిల్లా పరిషత్‌కు వెళ్లే మార్గం నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ మార్గానికి ఇరువైపులా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినికల్ లేబొరేటరీలు అధికంగా ఉన్నాయి. ఆయా ఆస్పత్రులు, ల్యాబ్‌లకు రోగులను చికిత్స, పరీక్షల కోసం వాహనాలతో తీసుకొస్తుంటారు. రోడ్డు చిన్నది కావడం, ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో ఈ మార్గంలో వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఒక్కోసారి నడిచేందుకు కూడా మార్గం లేక పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రద్దీ వల్ల రోజూ చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా పరిషత్ కూడలి నుంచి అంకోశా మీదుగా పందిమెట్ట వెళ్లే మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని పలువురు సూచిస్తున్నారు. రోగులను ఆయా ల్యాబ్, ఆస్పత్రిల వద్ద దించి వాహనాలు పందిమెట్టకు వెళ్లే మార్గంలో పార్కింగ్ చేసుకోవచ్చు.

కేజీహెచ్ ఎదుటే ఆటోలు, వాహనాలు

కేజీహెచ్ ఔట్‌గేట్ ఎదుట నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అంబులెన్స్‌లు కూడా కదలలేని స్థితి నెలకొంటోంది. ఆటోలు, కార్లు, బస్సులు ఈ ప్రాంతంలో కొంత సమయం ఆగాల్సిందే. ఇక్కడ ప్రైవేట్ ఆస్పత్రులు, మందుల షాపులు అధికంగా ఉండడం, ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ట్రాఫిక్ పోలీసులు ఎప్పుడో తప్పితే ఇక్కడ కనిపించడం లేదు. దీంతో ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలిపేస్తుంటారు. వాహనాల రాకపోకలకు అంతరాయంతో పాటు నిరంతరం చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ సమస్య పరిష్కారం కోసం తప్పనిసరిగా ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ ఉండాలని, ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కువ సేపు నిలపకుండా చర్యలు చేపడితే సమస్య పరిష్కారమవుతుందని పలువురు భావిస్తున్నారు.

జగదాంబ జంక్షన్లో ఆటోవాలాల హవా

జగదాంబ కూడలి నుంచి ఓ – ఆప్టెక్స్ మీదుగా ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రాంతంలో ఆటోవాలాలదే హవా. రోడ్డు మలుపులో ప్రయాణికులను దించేందుకు, ఎక్కించుకునేందుకు ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలిపేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడంతో ఇక్కడ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జగదాంబ, కలెక్టరేట్‌ల మధ్య ఉన్న అర కిలోమీటర్ దూరం చేరుకోవడానికి కనీసం 30 నిమిషాల సమయం పడుతోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జగదాంబ నుంచి ఓ – ఆప్టెక్స్ రోడ్డు మలుపులో ఆటోలు నిలపకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడితే ఈ సమస్య పరిష్కారం అవుతుందని నగరవాసులు కోరుతున్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ చేపట్టాలని సూచిస్తున్నారు.

సెల్లార్లు ఉన్నా నో ఎంట్రీ



సెల్లార్లు ఉన్నప్పటికీ వాటి వాచ్‌మేన్‌లు వాహనాలు అనుమతించకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఇదే అదునుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తీసుకుపోవడం, జరిమానాలు విధించడం పరిపాటిగా మారింది. ఆస్పత్రులు, ల్యాబ్‌ల సెల్లార్లలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలి.

– చిటికిరెడ్డి పవన్‌కుమార్, ద్విచక్ర వాహనచోదకుడు

పార్కింగ్ స్థలాలు లేకే..



మహా విశాఖపట్నం స్మార్ట్‌సిటీగా అవతరించింది. నగరం విస్తరించడంతో జనాభా విపరీతంగా పెరిగింది. అదేస్థాయిలో వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఎక్కడైనా వాహనాలు పార్కింగ్ చేయాలంటే పోలీసులు జరిమానా విధిస్తారని భయమేస్తోంది.

– పాల సురేష్, వాహనచోదకుడు

క్లుప్తంగా

రోడ్ల విస్తరణ కోసం పరిశీలన



సౌత్ జైల్‌రోడ్డులో పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగరంలో రోడ్ల విస్తరణను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ శుక్రవారం పరిశీలించారు. పర్యవేక్షక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. డాబాగార్డెన్స్, సౌత్ జైల్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, బీఆర్ఆర్ రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్లు ఏ విధంగా విస్తరించవచ్చో ఆరా తీశారు. ముఖ్యంగా ఆయా రోడ్లపై అవగాహన పెంచుకుని నిర్మించాలని ఆదేశించారు. పర్యవేక్షక ఇంజినీర్లు రవి, వినయ్‌కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, ఏడుకొండలు ఆయనతో ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



నర్సుల దినోత్సవంలో డాక్టర్ సాయి సునీల్‌కిషోర్, తదితరులు

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం మెడికవర్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కేక్ కట్ చేసి నర్సులకు తినిపించారు. రోగులకు వైద్య చికిత్స అందించే సమయంలో నర్సుల సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ శ్యామల, డాక్టర్ విద్యారమా, పెంటమ్మ, సరళ, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థ సభ్యునికి పరామర్శ



రాజు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సంస్థ సభ్యుడు దూడ రాజు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ శుక్రవారం పరామర్శించారు. రాజు పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పర్యవేక్షణలో రాజు చికిత్స పొందుతున్నాడు.

సీపీని కలిసిన యూజేఎఫ్ సభ్యులు

మహారాణిపేట: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మను ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్(యూజేఎఫ్) సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పాత్రికేయుల సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. 2023–24 ఉత్తరాంధ్రలోని పాత్రికేయుల సెల్ నంబర్లతో రూపొందించిన జర్నలిస్టు హ్యాండ్ బుక్ కమ్ డైరీని సీపీ చూసి బాగుందని అభినందించారని ఫ్రంట్ అధ్యక్షుడు ఎం.ఆర్.ఎన్.వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చౌదరి లక్ష్మణరావు, కె.రాము, సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

డాబాగార్డెన్స్: సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వసంతరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ కోరారు. 30వ వార్డు తాడివీధి, రెల్లివీధి సచివాలయాల్లో సిబ్బంది సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల సద్వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కోదూరు అప్పలరత్నం మాట్లాడుతూ కార్మికుల భద్రతకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన అవసరమన్నారు. భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికుల నమోదు, ఈ–శ్రమ నమోదు అవసరమన్నారు.

50 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో కార్పొరేటర్ నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మహారాణిపేట: జీవీఎంసీ 29వ వార్డులో మూడో విడతగా 50 మందికి కార్పొరేటర్ యు.నారాయణరావు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కల సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల మంజూరు పేరిట పేదల నుంచి లక్షలాది రూపాయలు డీడీల రూపంలో వసూలు చేసి కనీసం ఒక్కరికీ కూడా న్యాయం చేయకుండా వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కండిపల్లి సతీష్‌కుమార్, చొల్లంగి శేఖర్, పల్లా రాధాలక్ష్మి, దొప్ప సూరి, గండి అప్పలరాజు, సింగంపల్లి వెంకట్, ఒమ్మి కిషోర్, పసుపులేటి అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రతిభ పోటీలు

డాబాగార్డెన్స్: మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కళా ఉత్సవ్ పేరిట ప్రతిభ పోటీలు నిర్వహించనున్నట్టు అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఆ రెండు రోజులు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు ఉంటాయని చెప్పారు. శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, జానపద నృత్యం, వెస్టర్న్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంటల్, డ్రాయింగ్, పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ, గెటప్స్ పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలో పాల్గొనదలచే వారు 9966485335, 9553333134 కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కనక మహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 – 2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖనంలో శిక్షణ



గీసిన చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అల్లిపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్ర లేఖనంలో శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్ టీచర్ పి.సూర్యనారాయణ విద్యార్థులకు చిత్ర లేఖనంలో మెలకువలు నేర్పారు. అనంతరం నిర్వహించిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జంతువులు, పుష్పాలు రంగులతో చక్కగా చిత్రాలు గీసి ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

డాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిబిరాల్లో శుక్రవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముందుగా పిల్లలకు కథలు చెప్పి వారితో చదివించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎల్.రాజేంద్ర వర్మ, సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సేవకు మరో రూపం నర్సులు



కేక్ కట్ చేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించడంలో నర్సులకు ఎవరూ సాటిరారన్నారు. అనంతరం కేక్ కట్ నర్సులకు పంచిపెట్టారు. రిటైరైన నర్సులు సరోజిని, బి.సీతలతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సులు జయప్రద, వరలక్ష్మి, రాజకుమారి, పుష్ప, ఎల్.టి సుందరి సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్ నర్సులు డి.లక్ష్మి, పి.వరలక్ష్మి, వి.ఉషారాణి, ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'నారాయణ' సత్తా



విద్యార్థులతో నారాయణ కళాశాల డీన్ రామలింగేశ్వరరావు, డీజీఎం హనుమంతురావు

సీతమ్మధార: సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ఆశీలుమెట్టలోని సంస్థలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డీన్ రామలింగేశ్వరరావు, డీజీఎం హనుమంతురావు అభినందించారు. ఎంవీవీ హర్షవర్దన్ 490, పీలా తేజశ్రీ 487, ఎం.నిహారికా నాయుడు 485, సువ్వాడ మౌనిషా నాయుడు 485, హనుమంత్ నితిన్ 484, పాట్నూరు సాత్విక్ 484, పొన్నాడ రాజశ్రీ 484 మార్కులతో సత్తా చాటారు.

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ

సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సంస్థ నుంచి 1000 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, అందరూ ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ఏజీఎం రాజ్‌కుమార్ తెలిపారు. ఆశీలుమెట్ట ఒలింపియాడ్ బ్రాంచికి చెందిన ప్రత్యూష్ రౌత్రో 491/500 మార్కులు సాధించినట్టు తెలిపారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ రాం నరేష్, ఒలింపియాడ్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శివ ప్రతాప్, ప్రిన్సిపాల్ కోమలి పాల్గొన్నారు.

'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదల

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అన్నీ ప్రేమజ ఆదిశర్ల రూపొందించిన 'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదలైంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె ఈ పాటను విడుదల చేశారు. కేజీహెచ్‌లో 38 ఏళ్ల పాటు నర్సింగ్ వృత్తిలో కొనసాగి రెండేళ్ల కిందట నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసిన తన తల్లి ఎవాంజెలిన్ ఎస్తేర్‌కు ఈ పాటను అంకితం ఇస్తున్నట్టు ప్రేమజ తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో నర్సుల పాత్రను తెలియజేస్తూ రూపొందించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు. ఈ పాటకు సాహిత్యం తానే అందించానని, సూరజ్ గిప్సన్ సంగీతం, మనోహర్, పీటర్ వీడియో ఎడిటర్లుగా సహకారం అందించారని చెప్పారు.

కిక్ బాక్సింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు నారాయణరావు, అప్పలరత్నం

డాబాగార్డెన్స్: వేసవి శిబిరాల్లో భాగంగా కిక్ బాక్సింగ్ శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విశాఖ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు శిక్షణ ఇస్తున్నారు. దండుబజార్ ఎంవీడీ హైస్కూల్ వేదికగా నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు 21 రోజులపాటు శిక్షణ అందివ్వనున్నట్టు చెప్పారు. శిక్షణతోపాటు రోజూ అల్పాహారం అందజేయనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఎన్‌టీ రామారావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని శనివారం ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు డి.భూపతిరాజు, ఎం.కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ చేతుల మీదుగా తన నివాసంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ స్వరాంజలి, స్వరార్చన సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా.. జయమ్ము నిశ్చయమ్మురా.. పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫణిభూషణ్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్, నాగేశ్వరరావు, జ్యోతి, సత్యవతి, కల్యాణి, ధరణి, నిహారిక, ఉమాప్రియా తదితర గాయనీ గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలు ఆలపించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, స్వరమాధుర్యం అధ్యక్షుడు ఎంవీఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్‌కు ప్రింటర్ వితరణ



ప్రింటర్ కొనుగోలుకు చెక్కు అందిస్తున్న రజని

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకురాలు, శక్తి ఎంపవరింగ్ వుమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజనీ తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం నగరంలోని హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలకు ప్రింటర్ అందజేశారు. పిల్లలు మంచి వృద్ధిలోకి రావాలని అభిలషించారు. పాఠశాల ప్రతినిధి శ్రీనివాస్‌కు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కృష్ణకుమారి, ఇంగ్లిష్ టీచర్ జీఎస్ ప్రసన్న సమక్షంలో ప్రింటర్ అవసరమైన మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, శంకర్‌నారాయణ, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: సాధారణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల మనోరమా థియేటర్ వద్ద శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నరహరిదొడ్డిలో గల వినాయక దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని, పింఛన్లు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, బొడ్డేటి ప్రసాద్, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణ, ఆది విష్ణు, కోరాడ సురేష్, బోణి దేవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న బీజేపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి

మహారాణిపేట: జీవీఎంసీ 29వ వార్డు అంగడి దెబ్బ మురికివాడలో బీజేపీ నాయకులు శుక్రవారం ప్రజా చార్జ్‌షీట్ వినతుల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు ఎక్కువగా వినతి పత్రాలు అందజేశారు. ప్రతినెలా కరెంట్ బిల్లు అధికంగా వస్తుందని, వీటిని పరిష్కరించాలని, వివిధ కారణాలతో తొలగించిన వృద్ధాప్య, వితంతు పెన్షన్లు పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను పార్టీ పెద్దలకు తెలియజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామోదర్ యాదవ్, చంద్రశేఖరరావు, రూపాకుల రవికుమార్, దక్షిణ నియోజకవర్గ కన్వీనర్ కొప్పుల రామకుమార్, నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలు చెల్లించాలి



వార్డు ప్రజలకు యూజర్ చార్జీలపై అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ పార్వతి, సిబ్బంది

అల్లిపురం: యూజర్ చార్జీలపై జీవీఎంసీ 33వ వార్డు గౌరీవీధి సచివాలయం సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ పార్వతితో కలసి సచివాలయం కార్యదర్శి పీవీ కిరణ్‌కుమార్, జయచంద్ర, జాన్‌బాబు, వలంటీర్ కనక తదితరులు సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి యూజర్ చార్జీలు చెల్లించాలని కోరారు.

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం నేడు

సీతంపేట: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కళారాధన పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు అవసరం

మహారాణిపేట: మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. యాంటీ లార్వా నివారణ కోసం తరచూ మందులు పిచికారీ చేయాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి మణి మాట్లాడుతూ ఆస్పత్రుల సమన్వయంతో పనిచేసి వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి డాక్టర్ మురళీమోహన్, ప్రపంచ ఆరోగ్య ప్రతినిధి డాక్టర్ ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.